క్లుప్తంగా

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

బెజ్జూర్: వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యత అని ఎఫ్ఎస్ఓ మల్లికార్జున్, ఎఫ్‌బీఓ వెంకటేశ్ అన్నారు. మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామంలో గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన్యప్రాణులకు ఎవరైనా హాని కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వేసవిలో అడవికి వెళ్లేవారు అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలిపారు. అలాగే ముత్తడి అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు తిరుగుతున్నందున పశువులపై దాడి చేస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో రమేశ్, కృష్ణ, శంకర్, గోపాల్, తిరుపతి, బాపు రవి, భీమన్న, హన్మంతు, బక్కన తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

కౌటాల: వసతి గృహల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ప్యానెల్ టీం లీడర్ గావుడే హన్మంతు అన్నారు. కౌటాల కేజీబీవీ పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు కౌటాల ప్యానెల్ టీం సభ్యులు పాఠశాలను పరిశీలించినట్లు తెలిపారు. విద్యార్థులు మెరుగైన విద్యనందించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, రికార్డుల్లో సక్రమంగా వివరాలు నమోదు చేయాలన్నారు. పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. బృందం సభ్యులు శ్యాంసుందర్ రాకేశ్, స్వప్న, రాజబాబు, సంతోశ్, ప్రకాశ్, రమేశ్, ఎస్‌వో పవిత్ర ఉన్నారు.

కబడ్డీ విజేత తాండూర్ జట్టు



బహుమతి అందిస్తున్న కిష్టునాయక్

కెరమెరి: శ్రీంకటేశ్వరా కల్యాణ మహోత్సవం సందర్భంగా మండలంలోని అనార్‌పల్లిలో ప్రారంభమైన కబడ్డీ పోటీలు గురువారంతో ముగిశాయి. ఇందులో విజేతగా తాండూరు గ్రామానికి చెందిన జట్టు నిలవగా ప్రథమ బహుమతి రూ.11 వేలు అందించగా.. ద్వితీయ స్థానంలో ఆసిఫాబాద్ జట్టు నిలిచింది. వారికి రూ. 7 వేల నగదు బహుమతి అందించారు. ఆలయ కార్యదర్శి కిష్టునాయక్, గ్రామపెద్దలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాకేంద్రంలోని పెద్ద వాగు సమీపంలో గల శ్రీ బాలేశ్వరస్వామి ఆలయంలో రథోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆరవ రోజు భాగంగా వేద పండితుడు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో సుబ్రమణ్య మూల మంత్ర హోమం నిర్వహించారు. అనంతరం శ్రీ పార్వతి సమేత బాలేశ్వరస్వామికి సహస్ర పుష్పార్చన, తీర్థప్రసాద వితరణ చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్ దీక్ష చేపట్టాలి



పూజ చేస్తున్న దీక్ష గురువు శ్రీసద్గురు ప్రేమ్‌సింగ్ మహరాజ్

నార్నూర్: వచ్చే మహాశివరాత్రి రోజు నుంచి 41 రోజులపాటు ప్రతీ లంబాడా కుటుంబం నుంచి ఒకరు శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ దీక్ష చేపట్టాలని దీక్ష గురువు శ్రీసద్గురు ప్రేమ్ సింగ్ మహరాజ్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తపల్లి(హెచ్) గ్రామంలో ఉన్న జాతీయ బంజారా దీక్ష భూమి వద్ద శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా భోగ్ బండారో మహాపూజ చేశారు. భక్తులను ఉద్దేశించి హిత బోధనలు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తాక్రు నాయక్, మాజీ సర్పంచ్ చౌహాన్ దిగంబర్, పవార్ దేవిదాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రథోత్సవానికి ముస్తాబు

- జిల్లా కేంద్రంలో నేడు బాలేశ్వరస్వామి రథోత్సవం
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఆలయ కమిటీ, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు



సిద్ధం చేసిన రథం

ఆసిఫాబాద్అర్బన్:జిల్లాకేంద్రంలోని సమీప పవిత్ర పెద్దవాగు నదీ తీరాన గల భక్తుల కొంగుబంగారమైన బాలేశ్వరస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఈనెల 10 నుంచి ఆలయంలో నవరాత్రులు ప్రారంభంకానున్నాయి. నేడు రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. మున్సిపాలిటీ, ఆలయ కమిటీ, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో బందోబస్తుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయ చరిత్ర..

నాలుగు దశాబ్దాల క్రితం ఈ ప్రాంతాన్ని గోండు రాజులు పాలిస్తున్నాడు. ఈ క్రమంలో పెద్దవాగు ఒడ్డున ప్రస్తుతం దేవాలయం ఉన్న ప్రాంతంలో ఓ రైతు తన చేనులో నాగలిపట్టి దున్నతుండగా ఏదో తగిలినట్లు అనిపించింది. ఆ ప్రాంతంలో తవ్వి చూడగా శివలింగం బయటపడగా అక్కడే ప్రతిష్టించారు. గోండురాజులు రాతితో దేవాలయాన్ని నిర్మించినట్లు ప్రచారంలో ఉంది. నేటికి ఆలయంలో ఉన్న శివలింగంపై నాగలి తగలడం వల్ల ఏర్పడిన గాటును గమనించవచ్చు. అప్పటి నుంచి ప్రజలు, కమిటీ ద్వారా నిత్యం పూజలు జరుగుతున్నాయి. తదుపరి రాంచందర్‌రావ్(పైకాజీ) ఆలయానికి ప్రహరీ నిర్మించి శ్రీకారం చుట్టగా, నదీ ప్రవాహానికి కోతకు గురైంది. ప్రత్యామ్నాయంగా పిల్లర్లు వేసి కప్పు భాగాన్ని మరింత పెంచి మందిరం చుట్టూ ప్రహరీ నిర్మించారు. తదనంతరం దండనాయకుల నారాయణరావ్(రమేశ్‌బాబు) కొన్నేళ్ల నిర్వహణ చూసుకోగా, పట్టణ ప్రముఖులు టీఆర్ బాబురావ్ ఆలయ ఈశాన్యంలో ఉన్న హనుమంతుడి విగ్రహానికి మందిరాన్ని నిర్మించి భక్తుల సౌకర్యార్థం మెట్లు ఏర్పాటు చేశారు. ఇటీవల ఆలయం వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రజలు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, భక్తుల సహకారంతో ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ భక్తులపాలిట కొంగు భంగారంగా వెలుగొందుతుంది.

ఏర్పాట్లు పూర్తి

నేడు సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమయ్యే శ్రీ పార్వతి సమేత బాలేశ్వరస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయకమిటీ, మున్సిపాలిటీ, విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఉదయం 10 గంటల నుంచే అన్నదాన ప్రసాద వితరణ చేపట్టనున్నారు. సుమారు 50వేల మంది హాజరు కానున్నట్లు ఆలయ కమిటీ అంచనా వేస్తూ అందుకు తగ్గట్లుగానే ఏర్పాటు చేస్తోంది.

ఘనంగా సేవాలాల్ జయంతి



కెరమెరి: పూజలు చేస్తున్న భక్తులు

కెరమెరి: మండల కేంద్రంలో సేవాలాల్ 285వ జయంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. హోమం నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. సంత్ సేవాలాల్ చిత్ర పటానికి భక్తులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భోగ్ బండార్, నవధాన్యాలతో నైవేద్యం సమర్పించారు. వివిధ గ్రామాల భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ శేశేరావు, నాయకులు ఉత్తం నాయక్, రూప్‌లాల్, తదితరులు ఉన్నారు.

లింగాపూర్: మండలంలోని కొత్తపల్లి, దంపూర్, పిక్లాతండా, మొతిపటార్, లింగాపూర్, వంకామద్ది, గ్రామాల్లో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని నిర్వహించారు. మండలంలోని శ్రీ జగదంబా దేవి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

బెజ్జూర్: లంబాడాల ఆరాధ్యదైవం శ్రీ సంత్ సద్గురు అఖండ బాలబ్రహ్మచారి సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని లంబడిగూడ పంచాయతీలోని సేవాలాల్ మహారాజ్ జగదాంబ ఆలయంలో లంబాడీలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భోగ్ భండార్ కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులు కేసు నాయక్, చత్రునాయక్, సంతోష్ నాయక్, భిక్షపతి, తిరుపతి, విలాస్, కుమార్, గోపాల్, మంగిరాం, పెంటయ్య పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం



సన్మానిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలో పోలీసుశాఖలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్తున్న అధికారులను ఎస్పీ సురేశ్‌కుమార్ గురువారం సన్మానించారు. అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావ్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమేశ్, ఏ సూపరింటెండెంట్ ఇంకేశవ అలీ, బీ సూపరింటెండెంట్ శ్రీనివాస్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో వారిని పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో, జిల్లాలో వివిధ ముఖ్యమైన బందోబస్తులు విజయవంతంగా పూర్తి చేయడంలో ఎంతో కృషి చేశారన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఉత్తమ సేవలందించారన్నారు. జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలకు అచ్చేశ్వర్‌రావ్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నూతన డీఎస్పీ సదయ్య, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, ఆర్‌ఐలు, ఎస్సైలు, డీపీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన డీఎస్పీ

ఆసిఫాబాద్అర్బన్: ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య గురువారం ఎస్పీ సురేశ్‌కుమార్‌ను తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సదయ్యను అభినందించారు.

శిథిలావస్థలో సర్కారు బడి

- మర్థిడి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల
- భవనం పై కప్పు పెచ్చులూడి..
- ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల ఆందోళన



మర్థిడి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల

బెజ్జూర్: మండలంలోని మర్థిడి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఏళ్లగా నిర్మించిన భవనం కావడంతో కూలడానికి సిద్ధంగా ఉంది. వర్షాకాలంలో భవనం ఊరుస్తోంది. వర్షపు నీరు తరగతి గదుల్లో చేరడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఫ్లోరింగ్ పగుళ్లు తేలి దర్శనమిస్తోంది. భవనం పైకప్పు పెచ్చులూడడంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఉపాధ్యాయులు భయంభయంగా పాఠాలు బోధిస్తున్నారు. గతంలో పాఠశాలలో వసతుల లేమి కారణంగా కరోనా సమయంలో 6,7 రెండు తరగతులు తీసేసినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. పాఠశాలలో ప్రస్తుతం ఏకోపాధ్యాయుడితో కొనసాగుతోంది. 1 నుంచి 5 తరగతుల వరకు మాత్రమే బోధన సాగుతోంది. ప్రస్తుతం 20 మంది విద్యార్థులు మాత్రమే వస్తున్నారు. వీరి సంఖ్య తగ్గితే పాఠశాల మూతపడే ప్రమాదం లేకపోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని పాఠశాలకు నూతన భవనం నిర్మించి వసతులు కల్పించాలని కోరుతున్నారు. కాగా, మర్థిడి పంచాయతీలో గురువారం గ్రామసభ నిర్వహించారు. పలువురు గ్రామస్తులు పాఠశాలలో నెలకొన్న సమస్యలను లేవనెత్తారు. నూతన భవనం ఏర్పాటు చేస్తే తమ గ్రామంలోని పిల్లలు స్థానికంగా ప్రభుత్వ బడిలో చదువుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రైవేట్ పాఠశాలకు..

ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలంగా మారడంతో విద్యార్థులను తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా 2 కి.మీ దూరంలో ఉన్న సలుగుపల్లి ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు.

నడిచి వెళ్తున్నా



పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో 2 కి.మీ దూరాన సలుగుపల్లి గ్రామంలో పాఠశాలకు ప్రతిరోజు నడుచుకుంటూ వెళ్తున్నా. పాఠశాలకు నూతన భవనం నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– షేక్ శ్రేహన్, 7వ తరగతి విద్యార్థి

కొత్త భవనం నిర్మించాలి



వర్షాకాలంలో భవనం ఊరుస్తుంది. నాతో పాటు మా గ్రామంలో ఇంకొంత మంది స్నేహితులు బడికి వెళ్లడం లేదు. కొందరు వేరే పాఠశాలకు వెళ్తున్నారు. కొత్త భవనం నిర్మిస్తే ఇక్కడే చదువుకునే అవకాశం ఉంటుంది.

– మెర్పల్లి శరణ్, విద్యార్థి

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఎంపీడీవో క్రిష్ణరావు సందర్శించారు. విద్యార్థులు, గర్భిణులు, బాలింతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను సక్రమంగా నమోదు చేయాలన్నారు. గ్రామ కార్యదర్శి భీమయ్య తదితరులు ఉన్నారు.

సమ్మె నోటీసు అందజేత

ఆసిఫాబాద్అర్బన్: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీలో కమిషనర్ భుజంగరావ్‌కు కార్మికులు గురువారం సమ్మె నోటీసు అందజేశారు. నేటి సమ్మెలో మున్సిపాలిటీ పరిధిలోని కార్మికులందరూ పాల్గొంటారని వివరించారు. పెరిక శ్రీకాంత్, రాజు, శంకర్, మోతీరాం, మల్లేశ్, శ్రీనివాస్, ప్రభాకర్, వంశీ, ఉదయ్, తదితరుల పాల్గొన్నారు.

ఎంపీవో బదిలీ

దహెగాం: మండల పంచాయతీ అధికారి రాజేశ్వర్‌గౌడ్ బదిలీ అయ్యారు. ఈయన్ను రెబ్బెనకు బదిలీ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు బుధవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేశారు. అతని స్థానంలో ఎవరిని నియమించలేదు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

ఆసిఫాబాద్అర్బన్: గిరిజన గురుకులాలలోని ఇంటర్మీడియెట్‌లో ప్రవేశం కోసం నిర్వహించే సీఓఈ సెట్–2024కు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆసిఫాబాద్ ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.అనీత ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న ఉదయం 10 మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

పాఠశాలలో సూర్య నమస్కారాలు

ఆసిఫాబాద్అర్బన్: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో గురువారం మంత్రసహిత సామూహిక సూర్య నమస్కారాలు చేయించారు. ప్రధానాచార్యుడు గుండేటి కోటేశ్వర్‌రావ్, పాఠశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా దౌలత్‌రావు

జైనూర్: బీజేపీ మండల అధ్యక్షుడిగా కోట్నక దౌలత్‌రావును గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నాయకులు ఆత్రం అర్జున్ గణేశ్, తదితరులు ఉన్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్అర్బన్: కేజీబీవీల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఈవో అశోక్‌తో కలిసి కేజీబీవీ ప్రత్యేక అధికారులతో గురువారం పదో తరగతి వార్షిక పరీక్షలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. గత సంవత్సరం పది పరీక్ష ఫలితాల్లో 56శాతం మాత్రమే వచ్చాయని, ఈసారి 90శాతం ఫలితాలు సాధించేలా కృషిచేయాలన్నారు. విద్యార్థుల హాజరు వందశాతం ఉండేలా చూడాలని, విద్యార్థులకు స్లిప్పు టెస్టులు నిర్వహించి వారిలో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సాయంత్రం గంట సమయం అదనంగా ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. ఉదయం విద్యార్థులకు అల్పాహారం అందించాలని, ముఖ్యంగా ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థులు పరిక్షలకు సన్నద్ధమయ్యే విధంగా బోధించాలని పేర్కొన్నారు.

‘పది’ అంతర్గత మార్కుల పరిశీలన

కౌటాల: మండల కేంద్రంలోని ఇన్‌ఫంట్ జీసస్ ఇంగ్లిష్ మీడియం ప్రైవేట్ పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కులను ఉపాధ్యాయుల బృందం అధికారులు పరిశీలించారు. ఎఫ్ఏ1 మార్కులకు ఎఫ్1లోనే రౌండ్ ఆఫ్ చేయాలని హెచ్ఎంలకు సూచించారు. ఎఫ్ఏ2, ఎఫ్3, ఎఫ్4లకు కూడా వర్తిస్తుందని తెలిపారు. పాఠశాలల హెచ్ఎంలు గమనించాలని కోరారు. ఉపాధ్యాయులు అరుణ్‌కుమార్, రాంచందర్, శ్యాంరావు, హెచ్ఎం టామ్ థామస్ ఉన్నారు.

రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలి



కలెక్టర్ హేమంత్ బోర్కడేకి వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలోని సిర్పూర్(టి) మండలం హుడ్కిలి గ్రామ పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని గ్రామస్తులు కిర్మరె తరుణ్, తాడే రాకేశ్ కోరారు. జిల్లాకేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేకు గురువారం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో ప్రస్తుతం ఉన్న ఇన్‌చార్జి కార్యదర్శి నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఔట్‌సోర్సింగ్ కార్యదర్శిని బదిలీ చేసి గతంలో ఇక్కడే పనిచేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శి దిలీప్‌ను నియమించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



సత్యనారాయణ



రామేశ్వర్‌రావు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) ఎంపీడీవోగా పి.సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

ఇన్‌చార్జి ఎంపీవోగా కృష్ణమూర్తి

ఎంపివోగా విధులు నిర్వర్తించిన మహేందర్ బదిలీపై వెళ్లగా సిర్పూర్(టి) మేజర్ పంచాయతీ ఈవో టి.కృష్ణమూర్తి ఇన్‌చార్జి ఎంపీవోగా గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

లింగాపూర్: ఎంపీడీవోగా రామేశ్వర్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో గాదిగూడ ఎంపీడీవోగా పనిచేసిన ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతకు ముందు మండలంలో జేఆర్ ప్రసాద్ పనిచేసి బదిలీపై మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలానికి బదిలీపై వెళ్లారు.

కోరం లేక సమావేశం వాయిదా

కౌటాల: ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ విశ్వనాథ్ అధ్యక్షతన నిర్వహించాల్సిన సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరవడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకం



పెంచికల్‌పేట్: సన్మానిస్తున్న ఎంపీడీవో రమేశ్, తదితరులు



సిర్పూర్(టి): సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

కౌటాల: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని ఎంపీపీ విశ్వనాథ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పారిశుధ్య కార్మికులను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారని తెలిపారు. కాలనీల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారాన్ని వేయొద్దన్నారు. ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎంపీవో పూర్ణిమ, కార్యదర్శి సాయికృష్ణ, మాజీ సర్పంచ్ మౌనిశ్ తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని ఆయా పంచాయతీల కార్యాలయాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చివరి రోజున గురువారం ప్రత్యేక అధికారులు గ్రామసభలు నిర్వహించారు. గత వారం రోజులుగా పంచాయతీల్లో చేపట్టిన పారిశుధ్య పనులను గ్రామస్తులకు వివరించారు. అనంతరం పారి శుధ్య కార్మికలను సన్మానించారు. ప్రత్యేక అధికారులు తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో రమే శ్, ఎంపీవో గంగాసింగ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజర్ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామసభలో ఈవో, ఇన్‌చార్జి ఎంపీవో టి.కృష్ణమూర్తి గురువారం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈనెల 8 నుంచి 15వ తేదీ వరకు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రత్యేక గ్రామసభలో అంగన్‌వాడీలు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీటీసీ సోహెల్ అహ్మద్, మాజీ ఉప సర్పంచ్ తోట మహేశ్, నాయకులు ఇఫాత్‌హుస్సేన్, అఖిల్ అహ్మద్, అస్లాం, అంగన్‌వాడీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పండ్ల తోటల రక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సందీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా మామిడి, జామ తోటల్లో రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్‌కుమార్ అన్నారు. గురువారం ఉట్నూర్ ఐటీడీఏ ఉద్యాన నర్సరీ, శిక్షణ కేంద్రంలో నర్సరీల్లో పనిచేస్తున్న సాంకేతిక సహాయకులు, సిబ్బందికి పండ్ల తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పండ్ల తోటలను పరిశీలించి, నీటి ఎద్దడిని తట్టుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి సుదీర్‌కుమార్, సాంకేతిక సహా యకులు కుమారి, అర్పిత, పూజ పాల్గొన్నారు.